సాలు! ఓరెలాపోతే నీకేటిసెప్పు? ఓరుతినకఃపోతే నీకేటి? ఓరెలాసత్తే నీకేటి! నానుకూడాసత్తే నాపిల్లలగతేటి? నాకు మాసెడ్డకోపం సత్తాంది. నామాట ఇను. ఆ అయిదురూపాయిలూ పట్టుకెలితే ఓగుంట ఓపాలి ఒంటిమీద సెయి ఎయినిత్తాది. నేకపోతే ఆడబ్బుతో సుక్క ఏసుకుని సక్కాలొంగో. నాకు వొల్లుమండిపోతుంది. ఏంబాబూ! నువేటి సదుంకున్నావేటి? ఐదురూపాయిల కాయితంతో మా యాతన ఎల్లగొట్టాలనుకున్నావేటి? సెప్పు. బాబూ సెప్పు. నీకేమెలకువుంటే మాబతుకులిలా బండబారిపోతాయా? నీకే సత్తావుంటే, తిండినేకుండా మామిలా మాడిసత్తామా! సెప్పు బాబూ సెప్పు" అని ఆమె అన్నట్లు నాచెవులు విన్నట్లు నాకప్పుడనిపించింది.

నేను భారంగా ఇల్లు చేరుకున్నాను. ఆనాటినుండి ఆక్షణంనుండి, నామనసు పరిపరివిధాల పరుగులుతీసింది. నామది వెయ్యివిధాల ఆలోచించింది, నామనసు కొటి మిటలాడింది. నామది విరామంలేకుండా ఆరాటం పడింది. కొంతకాలానికి నాకు ఆమె నాదేశంలో అత్యంత పెద్దభాగమని అర్థమయింది. మరికొంత కాలానికి ప్రేమ సమాజాలు పెట్టడంద్వారా మానవత్వం వర్ధిల్లదనికూడా నాకు బోధపడింది. 'పో, పో, దారిద్ర్యమా!' అంటే పోదుపోదని చాలామందికి తెలిసినట్లు నాకుకూడా తెలిసింది!

మరికొంత కాలానికి- మరోనాడు- అప్పుడే తెల్లవారింది. నాకు మెలకువ వచ్చింది. 'మన దరిద్రం ఎలాపోతుంది? మన ఆకలి ఎలాతీరుతుంది? మనరోజులు ఎలా గడుస్తాయి? మనకష్టాలు ఎలా గట్టెక్కుతాయి?' ఆ మాటలు- ఆకస్టైలుకొట్టు వానిమాటలు నాచెవిలో మ్రోగాయి. అంతలో భాస్కరుడు ఎర్రగా ఎర్రగా ఉదయించాడు. ఆకాశం ఎర్రబడుతూంది. ఒక విహంగం ఉత్సాహంగా రెక్కలు ఆడిస్తూ ఎర్రబడుతున్న తూరుపుదెసకు పరుగులుతీసింది. ఆ కస్టైలుకొట్టువాని ప్రశ్నలకు జవాబు దొరికింది.

## జాలి

కె. వి. యస్. వర్మ

ఒక టౌన్‌లో
రైల్వే స్టేషన్‌లో
మండుటెండలో

ఇటువైపు ప్లాట్‌ఫారమ్ నుంచి అటువైపు ప్లాట్‌ఫారమ్ మీదకి వెళ్ళడానికి కట్టిన ఓవర్ బ్రిడ్జీమీద అటూయిటూ దీనంగా దైన్యంగా ఆకలిచూపులు చూస్తూ కూర్చున్నారు భిక్షగాళ్లు, ఆడా- మగా.

348

వాళ్ళు
కాల్చిపారేసిన సిగరెట్ పీకల్లా వున్నారు
వాడిపోయిన పువ్వుల్లా వున్నారు
రెక్కలు విరిగిన పక్షుల్లా వున్నారు.

వాళ్ళముందు సిల్వర్ గిన్నెలు ఉమ్మువేసే తొట్టెల్లా వున్నాయి. ఆ గిన్నెల్లో విడి పైసలు గజ్జికురుపుల్లా వున్నాయి

కింద రైళ్లు ఆగుతున్నాయి- వెళ్తున్నాయి. మనుషులు దిగుతున్నారు- ఎక్కుతున్నారు. అటువేపునుంచి ఇటూ, ఇటువేపునుంచి అటూ హడావుడిగా నడుస్తున్నారు.

బిచ్చగాళ్ళకేసి చూస్తున్నారు. విడిపైసలుంటే వేస్తున్నారు— స్వర్గంలో తమకి స్థానం కేటాయించబడిం దనుకుంటున్నారు. కొందరు చిల్లరలేదంటూ సానుభూతి చూపిస్తున్నారు. ఒక ఆసామీ పదిపైసల బిళ్ళ ఒకడికిచ్చి, మీరందరూ పంచుకోండని నలుగురికీ వినిపించేలా చెబుతున్నాడు గొప్పగా.

ఎల్లమ్మ తనగిన్నెవంక పాలుకోసం తల్లిరొమ్మును చూసే పసిపాపలా చూసింది. రెండు రెండుపైసల బిళ్ళలూ, మూడు విడిపైసలూ వున్నాయి.

ఎల్లమ్మ ముందునుంచి కాళ్లు కదులుతున్నాయి. చేతులు వూగుతున్నాయి. పైసలుమాత్రం రాలడంలేదు

పైసలు గిన్నెల్లో పడినప్పుడు వాళ్ళకళ్లు మెరుస్తున్నాయి. కృతజ్ఞతగా చూస్తున్నాయి. గంటలు గడుస్తున్నాయి.

బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటున్నారు. కడుపులు తడుముకుంటున్నారు. అలా చాలాసేపు ఓపిగ్గాచూసి, ఒక్కొక్కరూ లేచి రైల్వేస్టేషన్ దాటేరు.

నెమ్మదిగా వెంకటేశ్వరుడి కోవెల చేరుకున్నారు. కోవెల వెనక్కిపోయి కూర్చున్నారు. తమదగ్గరున్న పైసలు లెక్కపెట్టుకున్నారు. ఎంత తిండిదొరుకుతుందో అంచనావేసుకుంటూ ఆలోచనల్లో పడ్డారు.

వాళ్ళ ఆలోచనల్లో కార్లులేవు, బార్లులేవు, మోసాల్లేవు, మాయల్లేవు.

వెంకటేశ్వరుడి గుడిలో రంగు రంగుల లైట్లు ఆకాశంలో వేలాడుతున్న నక్షత్రాల్లా వున్నాయి. గంట క్షయరోగిదగ్గులా వినిపిస్తోంది.

భక్తులు బయట జోళ్లవిడిచి, దేవుడిముందు కళ్లమూసుకుని 'తమ జోళ్ళని ఎవరూ ఎత్తుకుపోరుగదా' అన్న ఆలోచన వచ్చినందుకు నాలుక్కరచుకుని, చెంపలు వేసుకుంటున్నారు. అరటిపళ్లు కొందరూ, కొబ్బరికాయలు కొందరూ దక్షిణతో పూజారితెచ్చిన పళ్లెంలో పెడ్తున్నారు. అందులో మూదోవంతు ప్రసాదంగా తీసుకుంటున్నారు. కళ్లకద్దుకుని నోట్లో వేసుకుంటున్నారు.

అప్పుడు భక్తులు లంచం యిచ్చి తమకు కావల్సినవి 'శాంక్షన్' చేయించుకునే కంట్రాక్టర్లలా వున్నారు. వాళ్ళముందు దేవుడు వాగ్దానంచేసి నిలబెట్టుకోలేని పొలిటికల్ నాయకునిలా వున్నాడు.

ఒకభక్తుడు తన పాతచెప్పులొదలి, కొత్తవి తొడుక్కునిపోతే సంతోషంగా; మరొకడు తనజోళ్లపోయేయని ఏడుస్తున్నాడు. రాత్రి పెరిగేకొలదీ భక్తులసంఖ్య తరిగిపోయింది.

పూజారి అరటిపళ్ళవంకా, కొబ్బరిముక్కలవంకా పళ్లెంలోని చిల్లరవంకా తృప్తిగాచూసి, ముందుతలుపులు మూసి. వెనకతలుపులు తెరిచాడు. లోపలి వెలుగు కొద్దిగా బయటికి వచ్చింది.

ఎల్లమ్మ పన్నెండు పైసలు పూజారిచేతుల్లో వదేసింది. పూజారి పది అరటిపళ్లిచ్చాడు. మిగతా వాళ్ళంతా తమదగ్గరున్న పైసలిచ్చి అరటిపళ్లు కొనుక్కున్నారు. ఆవురావురుమంటూ తినేసి మంచినీళ్ళకోసం పరుగెత్తారు.

తర్వాత నెమ్మదిగా మామూలుగా సంతపేటలోకినడిచి రేకుషెడ్డుల్లోకి దూరారు. గోడకిజేరబడి ఒకరూ, పడుకుని ఒకరూ కళ్లమూసుకున్నారు.

చీకటి చిక్కగా వుంది
గాలి స్థంభించిపోయింది.

ఎల్లమ్మ చీకట్లోకిచూస్తూ వాళ్ళందరికీ దూరంగా కూర్చుంది. ఆమె పక్కకి శీనయ్య వచ్చాడు. 'ఎల్లమ్మా' అన్నాడు. 'నేనే శీనయ్యనే' అన్నాడు. 'సచ్చిపోతన్నానే, కొంచెం కనికరించవే. నీకు పున్నెం వుంటాది' అన్నాడు. ఎల్లమ్మ మాట్లాడకుండా వూరుకుంది. శీనయ్య ఆమెని దగ్గరకు లాక్కున్నాడు. ఎల్లమ్మ కాళ్ళు ముడుచుకుంది.

* * *

350

రెండ్రోజుల ఆకలిని కడుపులో పెట్టుకుని, రెండేళ్ళ కుర్రోడ్ని వాళ్ళోపెట్టుకుని కూర్చుంది ఎల్లమ్మ. దీనంగా అడుగుతోంది, హీనంగా బ్రతిమాలుతోంది

కుర్రోడు ఏడుస్తున్నాడు. ఎండిన రొమ్ముల్ని నోట్లొపెట్టుకుని తననోట్లొ లాలాజలాన్ని మింగుతున్నాడు. ఎల్లమ్మ కుర్రోడ్ని బాధగాచూసింది, నీరసంగా మూలిగింది.

ఎల్లమ్మ మళ్ళీ మనసులో ఏడ్చింది. కుర్రోడ్ని కన్నందుకు, శీనయ్యపై దయ తల్చినందుకు, వాడికి లొంగినందుకు.

పట్టుచీరలూ, సాదాచీరలూ, జరీకండువాలూ, గ్లాస్కో పంచెలూ, నేరోకట్ పేంట్లూ గుడిలోకి ఎల్లమ్మ ముందునుంచి వెళ్తున్నాయి. చెవుల్లో పువ్వులు పెట్టుకుని వస్తున్నాయి. ముఖానికి బొట్లు పెట్టుకుని వస్తున్నాయి.

గిన్నెలో నాలుగే పైసలున్నాయి. ఎల్లమ్మకేమీ పాలుపోవడం లేదు. కుర్రోడు గుక్కపెట్టి యేడుస్తున్నాడు. కడుపు కణకణలాడుతోంది. కొన్ని నెలలుగా పూజారి వీళ్ళకి అరటిపళ్ళు అమ్మడం మానేశాడు. ఎక్కువ డబ్బు వస్తోందని కాంట్రాక్టుకి ఎవడికో యిచ్చేస్తున్నాడు.

ఎల్లమ్మ ఆలోచిస్తూ కూర్చుంది. పిల్లోడ్ని సముదాయించింది. వాడు ఏడుపు ఆపలేదు ఇంతలో ఎదురుగావున్న మిఠాయికొట్లో నుంచి ఒకకాకి మిఠాయివుండ తన్నుకుపోయింది. షావుకారు దాన్ని తిట్టుకుంటున్నాడు చేసేదేమీలేక.

ఎల్లమ్మ పెదవులపై చిరునవ్వు మెరిసింది. మనసు ఉత్సాహంగా వెన్నుతట్టింది. కళ్ళ కాంతిని పుంజుకున్నాయి.

ఎండ వేడిగా వుంది

ఆకాశం నిర్మలంగా వుంది

గాలి స్వచ్ఛంగా వుంది.

ఎల్లమ్మ లేచింది, పిల్లోడ్ని కూర్చోబెట్టింది. గుళ్ళోకి నడిచింది.

పూజారి అరటిపళ్లూ, కొబ్బరిచెక్కలూ సంచిలోవేస్తున్నాడు. పళ్లెంలో గుట్టలా చిల్లరవుంది.

ఎల్లమ్మ గుప్పెడు చిల్లరతీసింది. రెండోచేతి కందినన్ని అరటిపళ్ళు పట్టుకుంది. పూజారి వెర్రిగాచూశాడు. ఎల్లమ్మ నవ్వుతూ నిలబడింది.

"ఏయ్, బుద్ధుందా నీకు. లోపలికిరావచ్చా నువ్వు ? అవన్నీ యిక్కడపెట్టు. ఈ రెండుపళ్ళూ పట్టుకెళ్ళు"

"నీ బోడిజాలి నాకక్కర్లేదు"

"ఏవిటే కూస్తున్నావ్, అవిక్కడపెట్టు. లేకపోతే తంతాను" పూజారి కశ్శెరక్రి జేశాడు

"నువ్వన్నేయంగా అమ్ముకుంటున్నావ్. మేమాకల్తో సత్తన్నాం. నువ్వుతంతే నేను తిరగబడి తంతాను"

"పాపం మూటకట్టుకుంటున్నావే వెధవముండా. అందుకే అడుక్కుతింటున్నావ్"

"నోర్మూయ్‌రా లంజాకొడ్కా. పాపం గురించి నాకు సెప్పకురా. అట్టాగయితే నువ్వూ అడుక్కుతినాలి. అసలా ముండాకొడుకుంచే నిన్ను బతకనిత్తాడా" ఎల్లమ్మ సింహంలా గర్జించింది.

పూజారి నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

ఎల్లమ్మ కుర్రోడిదగ్గర కొచ్చింది. వాడ్ని ఎత్తుకుంది. ఆ మెలో భయంలేదు, బాధలేదు, దిగులులేదు. ఎల్లమ్మ నరనరంలోనూ నూతనోత్సాహం ఆవరించింది. గుండెనిండా ధైర్యం నిండిపోయింది. శరీరం గాలిలో తేలిపోయింది.

ఇప్పుడు ఎల్లమ్మ వజ్రంలావుంది. కత్తిలావుంది, అసలైన మనిషిలావుంది.

## ఆస్థానకవి

తేజోనిధి

అనగనగా క్రీస్తుశకంలోనే ఆనందనిలయ సామ్రాజ్యాన్ని సింహబల మహా చక్రవర్తి పరిపాలన చేస్తుండేవాడు. తన ఆనందనిలయ సామ్రాజ్యంలో అంతా ఆనందంగా గడుపుతున్నారని సింహబల మహాచక్రవర్తి సంతోషం వెలిబుచ్చేవాడు.

తన రాజ్యానికేం—

రథ- గజ- తురగ- పదాతిదళాలు సర్వసన్నద్ధంగా ఉండేవి. తనరాజ్యంలో ఎక్కడ విచారం తలెత్తినా సైన్యం సమాయత్తమైపోయి— విచారాన్ని సంతోషంగా మార్చి— ఇంచక్కా రాజధాని చేరుకొనేది.

352